క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన కోఆర్డినేటర్



తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: ప్రజలతో మమేకమవుతూ నిత్యం వారికి అందుబాటులో ఉండాలని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారని పి.గన్నవరం నియోజక వర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా సత్యవతి



మామిడికుదురు: లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిగా కె.సత్యవతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పశ్చిమగోదావరి జిల్లా ఆచంట వేమవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ వైద్యాధికారిగా పని చేసిన రమ్యశైలజ అమలాపురం రూరల్ మండలం పేరూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా బదిలీ అయ్యారు. వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన సత్యవతిని ఉద్యోగులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది ఎంపిక

ఆలమూరు: ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ విద్య అభ్యసించేందుకు మండలంలోని మూడు జెడ్పీ హైస్కూళ్ల నుంచి తొమ్మిది మంది ఎంపిక య్యారు. జిల్లా వ్యాప్తంగా 130 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా అందులో ఆలమూరుకు చెందిన బొబ్బా జయశ్రీ బాలికోన్నత జెడ్పీ హైస్కూల్ నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో పి.రిషిత సంతోషిణి, ఎల్.లతిక, ఎల్.హరిత రథిక, ఎస్.సాయి హరిణి, వి.బిందు వర్షిణి, పి.గీతా సలోమి, వి.వర్షిత ఎంపికయ్యారు. అలాగే చెముడులంక జెడ్పీ హైస్కూల్ నుంచి డి.సూర్యప్రకాష్, నర్సిపూడి నుంచి ఎస్.ప్రణీత తదితరులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన వారిలో ఉన్నారు.

విజయోత్సవాలు



విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

మలికిపురం: నాసా స్పేస్ ఎక్స్ యాక్సియం-4 మిషన్ విజయవంతమైన సందర్భంగా మండలంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో సంబరాలు జరుపుకొన్నారు. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు జై భారత్, జై జై భారత్ అంటూ నినాదాలు చేసి దేశభక్తిని చాటారు. పాఠశాల కరెస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు, నాసా బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా వేషధారణలో నిలిచి జేజేలు పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

ఆలమూరు: బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివ నాగ మల్లేశ్వరరావు కోరారు. మండలంలోని ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లో బుధవారం లేబర్ ఆఫీసర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ, అంగన్‌వాడీ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖాధికారులతో కూడిన బాల కార్మికులను గుర్తించే బృందం మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పర్యటించింది. ఇటుకబట్టీల వద్ద తప్పనిసరిగా బాల కార్మికులకు ప్రవేశం లేదని బోర్డులు ఏర్పాటు చేయాలని యజమానులకు అధికారుల బృందం విజ్ఞప్తి చేసింది.

29న పశువులు, కోళ్ల ప్రదర్శన

యానాం: పశుగణాభివృద్ధి, పశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న పశువులు, కోళ్ల ప్రదర్శన యానాం పశువుల ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్టు బుధవారం వైద్యాధికారి వి.కొమారణె ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేలు రకపు జాతి ఆవులు, గేదెలు, పెయ్యలు, మేకలు, గొర్రెలు, అదే విధంగా కోళ్లు, మేలురకపు జాతి కుక్కల ప్రదర్శనకు అనుమతించినట్టు తెలిపారు. ఆ రోజు పశువుల నమోదు ప్రక్రియ, అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తాళ్లరేవు: స్థానిక సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్స్ పరిధిలోని చెట్ల కొమ్మలు కట్ చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాళ్లరేవు మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కలవరపెడుతున్న కోత

- గోదావరిలో కూలిపోతున్న కొబ్బరిచెట్లు
- ఆందోళనలో రైతులు
- గ్రోయిన్లు నిర్మించాలని డిమాండ్



అప్పనపల్లిలో గోదావరిలో కూలిపోతున్న కొబ్బరిచెట్లు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల్లో నదీపాతం తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రూ.కోట్లు విలువైన భూములు ఏటా నదీ గర్భంలో కలసిపోతున్నాయి. రోజురోజుకూ నదీపాతం శ్రుతిమించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. కోత నివారణకు రివిట్‌మెంట్ నిర్మాణంతో పాటు గ్రోయిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కనుమరుగవుతున్న గ్రోయిన్లు...

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు గోదావరిలోకి జారిపోతున్నాయి. **అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. పై గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు కనమరుగయ్యాయి.** మరికొన్ని చోట్ల గ్రోయిన్లు పాడైపోవడంతో నదీపాతం మరింత ఎక్కువయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పాడైపోయిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల మరమ్మతులకైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు.

కోత నివారణకు చర్యలు తీసుకోవాలి



గోదావరి నదీకోత నివారణకు చర్యలు తీసుకోవాలి. తీరంలో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. బి.దొడ్డవరంలో మా భూమి రెండెకరాలకు పైగా గోదావరిలో కలసిపోయింది. మేము చాలా తీవ్రంగా నష్టపోయాం. మాలా చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పాటోలు భీమశంకరం, బి.దొడ్డవరం, రైతు

పట్టించుకోవడం లేదు



గోదావరి కోతతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గోదావరి కోత నివారణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో హామీ ఇవ్వడం తప్ప ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యం. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కోత నివారణకు చర్యలు చేపట్టాలి. రైతులను ఆదుకోవాలి.

– కంచి నీలకంఠం గురుమూర్తి, రైతు, పెదపట్నంలంక

కాలేయ వ్యాధిగ్రస్తుడికి రూ.50 వేల సాయం



రోగికి ఆర్థిక సాయం అందిస్తున్న దాత పాపారావు

ఆలమూరు: కాలేయ వ్యాధితో బాధపడుతున్న రోగికి శస్త్రచికిత్స చేయించుకునేందుకు వీలుగా ఆలమూరుకు చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే కొత్తపేట మండలంలోని వాడపాలెం గ్రామానికి చెందిన అమలాపురపు వీరభద్రం గత కొన్ని రోజులుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నారు. లివర్ మార్పిడి చికిత్స నిమిత్తం రూ.35 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో విషయం తెలుసుకున్న దాత పాపారావు బుధవారం రూ.50 వేల సాయం అందించారు. బాధిత రోగి వీరభద్రం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కాలువలో గుర్రపుడెక్క తొలగించాలి



నగరం పంట కాలువలో గుర్రపుడెక్క తొలగించాలని నిరసన తెలుపుతున్న రైతులు

మామిడికుదురు: నగరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఈదరాడ వరకు ఉన్న ప్రధాన పంట కాలువలో గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. కాలువ అభివృద్ధి చేయాలని కోరుతూ బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. అనంతరం దీనిపై ఎంపీడీఓ జి.భవానికి వినతిపత్రం ఇచ్చారు. గుర్రపుడెక్కతో పంటకాలువ పూర్తిగా మూసుకుపోయిందన్నారు. దీని వల్ల సాగునీరు పారుదల కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నారుమడులు వేసుకునేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుని, సాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ భవాని రైతులకు హామీ ఇచ్చారు. ఎంపీడీఓను కలసిన వారిలో రైతులు తాటికాయల ఉదయభాస్కర్, జాలెం రమేష్, వానరాశి బుజ్జి, కడలి నాగేశ్వరరావు, ముద్దల రాంబాబు, కడలి వీరవెంకటసత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

సర్వీస్ రూల్స్ అమలు చేసి బదిలీలు చేయాలి



మామిడికుదురులో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మామిడికుదురు: గ్రామ, వార్డు సచివాలయ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ చానల్ కల్పించి, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాతే బదిలీలు చేపట్టాలని కోరుతూ మామిడికుదురు మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ జి.భవానికి వినతిపత్రం ఇచ్చారు. సీనియారిటీ, మెరిట్ జాబితాలు విడుదల చేసిన తర్వాత సజావుగా ట్రాన్స్‌ఫర్స్ చేయాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్, పెండింగ్ ఏరియర్స్ వెంటనే క్లియర్ చేయాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్ కోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగులు సొంత మండలాల్లోనే పని చేసే వెసులుబాటు కల్పించాలన్నారు. ఎస్.సుధీర్, ఎం.సుభాష్, జి.విజయ్, జి.రవిశంకర్, బి.సురేష్, కె.సత్యలత, బి.సుష్మ, కె.అనూషసత్య, ఎం.లలితశ్రీ, తదితరులు ఉన్నారు.

మాచవరంలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు



మాచవరంలో నిల్వ చేసిన ఇసుకగుట్టలు

అంబాజీపేట: మండలంలోని మాచవరం శివారు ముంగండ సమీపంలోని ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున ఇసుకను గుట్టలుగా నిల్వ చేశారు. పి. గన్నవరం మండలం ముంగండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఈ ఇసుకను నిల్వ చేసినట్లు తెలిసింది. రాబోయే వర్షాకాలంతో పాటు గోదావరి పాయకు వరద పోటెత్తితే ఇసుక తీసే అవకాశం లేకపోవడంతో ముందుగానే ఇసుకను భారీ ఎత్తున నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. అనంతరం భారీ ఎత్తున విక్రయాలకు ఉపయోగపడేలా ప్లాన్ చేస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికారం మాది ఎక్కడైనా ఇసుక నిల్వ చేస్తాం అడిగేవారు ఎవరూ అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరుకు సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారని, వారి అండతోనే అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుందని పలువురు తెలిపారు. మాచవరంలో భారీ ఎత్తున ఇసుక నిల్వ చేసినట్లు అంబాజీపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు తెలపడంతో ఇసుక నిల్వ చేసిన ప్రాంతానికి వీఆర్వోను పంపి విషయం తెలుసుకుంటానన్నారు.

ఎంపీడీఓకు ఉత్తమ యోగా నిర్వహణ అవార్డు



కలెక్టర్, జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రతిభను కనబరచి ప్రత్యేక కృషి చేసిన ఎంపీడీఓ ఎ.రాజు జిల్లా ఉత్తమ యోగా నిర్వహణ అవార్డుకు ఎంపికయ్యారు. అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చేతుల మీదుగా బుధవారం ఆయన అవార్డు అందుకున్నారు.

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు సురేష్

కొత్తపేట: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక కళ్యాణ మండపంలో జరిగిన మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సర్వసభ్య సమావేశంలో జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి, అధ్యక్షుడు గెద్దం సురేష్, కార్యదర్శి దొరబాబు తదితర కార్యవర్గ పెద్దల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గంధం నాగశ్రీ రామపెద్దిరాజు, ఉపాధ్యక్షుడిగా పాలంగి శ్రీను, కార్యదర్శిగా దూనబోయిన శ్రీను, కోశాధికారిగా యాండ్ర శివకళ్యాణకుమార్, కార్యవర్గ సభ్యులుగా ముమ్మిడివరపు రాజశేఖర్, కొత్త సాయిసుబ్రహ్మణ్యం, పట్టా రాజులను ఎన్నుకున్నారు. వారితో జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్ ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా కెమెరా సృష్టికర్త దాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటో, అండ్ వీడియోగ్రాఫర్ నామాల వెంకటేశ్వరరావు (శ్రీను), యెలిశెట్టి ప్రభాకర్, కె.బంగార్రాజు, కొప్పిశెట్టి శివకుమార్, గాంధీ, నాగేశ్వరరావు, డి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా



జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేపీ రాజు, అధ్యాపకులు

కొత్తపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 11 కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా 513 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారి అర్హతలు పరిశీలించి, వారిలో 192 మందిని వివిధ కంపెనీల్లో వివిధఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ జి.రమేష్, వికాస జిల్లా మేనేజర్ కె.రాజేంద్రప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

8 మంది డిగ్రీ విద్యార్థుల ఎంపిక

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక కాపు కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 8 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఆ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాకు తమ కళాశాల నుంచి జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 52 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 8 మంది ఎంపికయ్యారని, మరో 18 మంది తదుపరి ప్రక్రియకు ఎంపికై ఆయా కంపెనీల నుంచి నియామక పత్రాలను అందుకున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాసు, అధ్యాపకులు కె.సత్యనారాయణ, బి.సత్య తదితర అధ్యాపకులు అభినందించారు.

ప్రజాస్వామ్యానికి నాటి ఎమర్జెన్సీ గొడ్డలిపెట్టు



కొత్తపేట డిగ్రీ కళాశాల సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేపీ రాజు



ఎమర్జెన్సీలో అరెస్టయిన వెంకటశాస్త్రిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా

కొత్తపేట: 1975 జూన్ 25న భారతదేశంలో విధించిన అత్యవసర పరిస్థితి(ఎమర్జన్సీ), ఆనాటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, హిస్టరీ అధ్యాపకురాలు సీహెచ్ భవాని అన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'సంవిధాన్ హత్యా దివస్' పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో భవాని నాటి అత్యవసర పరిస్థితికి సంబంధించి అనేక అంశాలను కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డీసీహెచ్ పాపారావు, కె.సత్యనారాయణ, సీహెచ్ నాగరాణి, విజయకుమార్, కేఎస్ఎన్ ప్రసాద్, నాగ శ్రీలక్ష్మి, హేమలత, పలువురు విద్యార్థులు ప్రసంగించారు.

దేశ చరిత్రలో చీకటిరోజు

పి.గన్నవరం: భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీ అత్యంత చీకటి రోజని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ రోజుల్లో ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుబడిన వీరులకు ముంగండ గ్రామంలో బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. 50 ఏళ్ల క్రితం ఎమర్జెన్సీ సందర్భంగా అరెస్టు అయిన ముక్కామల వెంకటశాస్త్రిని వేమా సత్కరించారు. అలాగే అప్పట్లో అరెస్టయిన దివంగత నడిమింటి నాగరాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణమూర్తి, మాలే శ్రీనివాస నగేష్, చీకరమెల్లి శ్రీనివాసరావు, కుడుపూడి సూర్యనారాయణ, పెయ్యల అబాజీ శర్మ, కోటే శివాజీ, మేడిది సత్యనారాయణ, పిన్నింటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా పనిచేయాలి



మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

ఆలమూరు: సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా పని చేసి అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు గ్రామాల్లోని సబ్ సెంటర్లను పరిశీలించి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలను సంబంధించిన మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయో లేదోనని అలాగే ఫార్మసీని, ల్యాబ్‌లను పరిశీలించి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలు నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలో మందులను అందుబాటులో ఉంచామన్నారు. అలాగే రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, బి.అనంతరామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్ పి.శివప్రసాద్, హెల్త్ విజిటర్ ఆర్.బాలామణి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి యువత పోవద్దు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐలు శేఖర్ బాబు, కాత్యాయని

రావులపాలెం: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా మంచి అలవాట్లు చేసుకోవాలని రావులపాలెం టౌన్ సీఐ శేఖర్ బాబు, కొత్తపేట ఎక్సైజ్ సీఐ కాత్యాయని అన్నారు. ఈనెల 26వ తేదీ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టీఎస్ఎన్‌టీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఐ శేఖర్‌బాబు, కాత్యాయని మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి యువత పోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. యువత మాదకద్రవ్యాలను నిర్మూలించడంలో ముఖ్యపాత్ర పోషించాలని, వాటిని తరలించేవారు, విక్రయించేవారు, సేవించేవార్లను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే యువత ఇటువంటి చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆవుకు శస్త్ర చికిత్స

అమలాపురం టౌన్: పట్టణంలోని వడ్డిగూడెంలో ఓ ఆవు గర్భసంచి సమస్యతో పెద్ద ప్రేగు వెలుపలకు వచ్చి లేవలేని పరిస్థితుల్లో ప్రమాదకరంగా అవస్థలు పడుతోంది. దీనిపై స్థానికుల స్పందించి పశు అంబులెన్స్ '1962'కు ఫోన్ చేసి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి వైద్య సిబ్బందితో వచ్చి ఆవుకు శస్త్ర చికిత్స చేశారు. వెలుపలకు వచ్చిన పెద్ద ప్రేగును లోనికి పంపించి గర్భసంచిని సరిచేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆవుకు తక్షణమే అత్యవసర వైద్యం అందించారు. అది రెండు రోజుల్లో కోలుకుంటుందని డాక్టర్ విజయరెడ్డి చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆవు నెమ్మదిగా లేచి తన దూడకు పాలు ఇవ్వడంతో స్థానికులు సంతోషించారు. వైద్యునితోపాటు పశు వైద్యాధికారులు డాక్టర్ ఎం.నారాయణరావు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హెప్సిబా, డాక్టర్ శివ తేజ ఉన్నారు. పశు ప్రేమికులు జి.శ్రీనివాస్, చిన్నబాబు తదితరులు ఆవుకు అత్యవసర శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన పశు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



తొత్తరమూడిలో చిన్నపాటి వర్షానికి బురదగా మారిన ముక్తేశ్వరం-ముమ్మిడివరం రహదారి

అయినవిల్లి: చిన్నపాటి వర్షం వస్తే మండలం నుంచి తొత్తరమూడి మీదుగా ముమ్మిడివరం మండలం కలుపుతూ ఏర్పాటు చేసిన ముక్తేశ్వరం-ముమ్మిడివరం రహదారి చిత్తడిగా మారుతోంది. ఈ రహదారి రెండు మండలాలను కలుపడమే కాకుండా చుట్టపక్కల నున్న ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం ఇటు కొత్తపేట, రావులపాలెం మండలాల ప్రజలు వేలాదిగా ఈ రహదారిపై ప్రయాణిస్తూ ఉంటారు. ఇంత ఉపయోగకరమైన రహదారి రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుంది. చిన్నపాటి వర్షానికి ఈ రహదారి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఈ రహదారిని కనీస మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం ఆర్అండ్‌బీ వంతయింది. ప్రభుత్వానికి ఈ విషయమై విన్నవించే ప్రజాప్రతినిధులు కరువయ్యారు. ఈ రహదారిని ఇకనైన అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.